సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 19-2-2025

సంపుటి: 20 సంచిక: 278

పేజీలు: 8 వెల: రూ.1


## పాలకొండకు రేపు జగన్ రాక

❖పాలవలస కుటుంబానికి పరామర్శ
❖జగన్ పర్యటన విజయవంతం చేయండి
❖పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్ పిలుపు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఇటీవల పాలవలస రాజశేఖరం మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఈ నెల 20న గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి పాలకొండ పట్టణానికి వస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా తాడేపల్లి నుంచి విశాఖపట్నం విమానాశ్రయం చేరుకొని, అదే హెలికాప్టర్లో పాలకొండ వస్తారని చెప్పారు. జగన్ పర్యటన శ్రేణులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పరామర్శ కార్యక్రమానికి ఆయా నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆ ప్రకటనలో కృష్ణదాస్ కోరారు.







నాలుగు కేటగిరీలుగా విభజిస్తూ మత్స్యశాఖ తయారుచేసిన మ్యాప్



కోర్టు ఆదేశాలతో రొయ్యలచెరువు గట్లను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్‌ఫోటో)




# రొయ్యమీసాలు తిప్పుతున్న మత్స్యశాఖ

❖న్యాయస్థానం ఆదేశాలు బేఖాతరు
❖సీఏఏ నిబంధనలకు విరుద్ధంగా సాగు
❖నాలా లేకున్నా చెరువులకు అనుమతులు
❖శాఖలో అధికారులు కమీషన్ల కోసం కుమ్ములాటలు

**శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగల్లపేట, పుక్కళ్లపేట మత్స్యకార గ్రామాలను తనలో కలుపుకోవడానికి ప్రతి ఏడాది వరదల సమయంలో స్థానికులను నాగావళి భయపెడతూ ఉంటుంది. దీనికి బలం చేరూర్చేలా అక్రమ రొయ్యలు చెరువులు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్నాయని స్థానికులు విన్నవిస్తున్నా అధికారులు లెక్కచేయడం లేదు. సీఏఏ నిబంధనలకు విరుద్ధంగా చెరువులను తవ్వి రొయ్యలు సాగు చేస్తున్నారని స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిని అడ్డుకుంటున్నా మత్స్యశాఖ అధికారులకు పట్టడంలేదు. న్యాయ స్థానంలో అక్రమంగా సాగుచేస్తున్న రొయ్యల చెరువులపై స్థానికులు వేసిన వ్యాజ్యం పెండింగ్‌లో ఉన్నా సీఏఏ జాయింట్ కమిటీ వాటిని రెన్యువల్ చేసేశారు.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రెన్యువల్ చేసే అధికారం సీఏఏ జాయింట్ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావుకు ఉంది. కమిటీలో సభ్యులుగా వ్యవహరించే ఎఫ్‌డీవో గంగాధర రావుతో పాటు మిగతా సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎటువంటి వివాదం లేదని నివేదిక ఇచ్చి రెన్యువల్ కోసం సిఫార్సు చేయాలి. సిఫార్సు చేసిన తర్వాత దాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు రెన్యువల్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. రెన్యువల్ ఇచ్చిన మోపసుబందరు సర్వే నెంబర్ 115లోని 5.25 ఎకరాల రొయ్యల చెరువులపై హైకోర్టులో వివాదం నడుస్తోంది. హైకోర్టులో వివాదం నడుస్తున్నట్టు తెలిసినా మత్స్యశాఖ అధికారులు డబ్బులు తీసుకొని రెన్యువల్ ఇచ్చేశారు. ఎందుకు ఇచ్చారని స్థానిక ఎమ్మెల్యే ఎదుట పంచాయితీ నడిచినట్టు తెలిసింది. దీనిపై డీడీ, ఎఫ్‌డీవో ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకున్నారు తప్ప రెన్యువల్ ఎలా చేస్తారని పీజీ పేట గ్రామస్తులు ప్రశ్నిస్తే.. ఎఫ్‌డీవో నివేదిక ప్రకారం సంతకం చేశానని డీడీ సమాధానం చెప్పారు. ఎఫ్‌డీవోను ప్రశ్నిస్తే.. కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించాల్సిన బాధ్యత కన్వీనర్‌గా డీడీకి లేదా? అంటే సమాధానం చెప్పడం ప్రారంభించారు. ఈ వ్యవహారంలో ఇద్దరూ దోషులేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**ప్రభుత్వ ఖజానా నుంచి రూ.58 లక్షలు**

పీజీ పేట సమీపంలో సముద్రంలో నాగావళి కలిసే ప్రాంతంలో లెక్కకు మించి చెరువులు తవ్వి రొయ్యలు సాగు చేస్తున్నారు. ఈ చెరువులన్నీ సీఏఏ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఎనిమిదేళ్లుగా స్థానికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులో పోరాటం చేస్తున్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు అక్రమార్కులతో అంటకాగు తున్నారు. న్యాయస్థానాలకు, ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తూ అక్రమాలకు వంతపాడుతున్నారు. రెండేళ్ల క్రితం గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి ఒక కమిటీ వచ్చి ఈ ప్రాంతాన్ని పరిశీలించింది. స్థానికులతో మాట్లాడి వారినుంచి వివరణ తీసుకున్నారు. అంతకు ముందు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో 46 చెరువులను తొలగించినట్టు చూపించారు. అందుకోసం సుమారు రూ.58 లక్షలు ఖర్చు చేసినట్టు చెప్పి ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు

- మిగతా చివరి పేజీలో

## 20న సర్ పరశురాం పాత్రో పుస్తకావిష్కరణ

✻ ఆహ్వాన కమిటీ ప్రతినిధి బుడుమూరు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆధునిక సమాజంలో సంస్కరణలకు ఆధ్యుడుగా పేరొందిన సర్ రావు బహదూర్ అన్నెపు పరుశురాం పాత్రో జీవితచరిత్రను ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ నెల 20న పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్టు పుస్తకావిష్కరణ ఆహ్వాన కమిటీ ప్రతినిధి బుడుమూరు శ్రీరామూర్తి తెలిపారు. ఈమేరకు బుధ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం కొత్తరోడ్డులోని శాంతి కన్వెన్షన్‌లో కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో పీఏ పాత్రో పుస్తకాన్ని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాల వలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆవిష్క రిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పుస్తకాన్ని సుమారు మూడున్నర సంవత్సరాలు పరిశోధన చేసి భవిష్యత్ తరాల కోసం పాత్రో జీవిత చరిత్రను అందజేయడానికి వీర గున్నమ్మ సినీ దర్శకులు, నిర్మాత, రచయిత గూన అప్పారావు రచించినట్టు తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు పరశు రాం పాత్రో 1923లో మద్రాస్ ప్రెసిడెన్సీలో విద్యాశాఖ మంత్రిగా ఉంటూ విశాఖలో ఆంధ్రా యూనివర్శిటీని ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా మద్రాస్ ప్రెసిడెన్సీలో బిల్లు పెట్టి రిజర్వేషన్లు అమలు చేసింది పరశురాం పాత్రో అని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు విద్యాసంస్థల్లో అమలు చేయించడంలోనూ కృషి చేశారన్నారు. బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా జస్టిస్ పార్టీని ఏర్పాటుచేసి తమిళనాడు సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి వంటి అనేకమందితో కలిసి మనువాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చి ముత్తు లక్ష్మీరెడ్డిని పోటీ చేయించి మొదటి మహిళా ప్రజాప్రతినిధిగా పరశురాం పాత్రో గెలిపిం చారని తెలిపారు. నిమ్నవర్గాలుగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను క్రిమినల్ ట్రైబల్ యాక్ట్ నుంచి విముక్తి కలిగించి యాక్ట్ రద్దు చేయించారని గుర్తు చేశారు. క్రిమినల్ ట్రైబల్‌గా గుర్తించబడిన 246 తెగలే నేడు



బీసీ, ఎస్టీ, ఎస్సీగా స్వాతంత్ర్య అనంతరం రిజర్వేషన్లు పొందుతున్నారని వివరించారు. గూన అప్పారావు చారిత్రాత్మకమైన అంశాలు వెలుగు తీయడంలోను, అధ్యయనం చేయడంలోను, భావితరాలకు అందించడం లోను మంచి కృషి చేశారన్నారు. పుస్తక విష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మేధావులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**అధికారమే పరమావధి కాదు.. కాకూడదు కూడా. అధికారంలోకి రావాలంటే ప్రజాక్షేత్రంలో ప్రజల మెప్పుపొందాలి. పోరాట పటిమ కనబరిచి, కోల్పోయిన దానిని సాధించాలి. ఏపీ రాజకీయాలలో ప్రతిపక్ష వైకాపా తీరు గమనిస్తే ఇదేమీ కనిపిస్తున్నట్లు లేదు. నిజానికి ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత వైకాపా ప్రభుత్వంతో పోలిస్తే బటన్ నొక్కడం ఆలస్యమవుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సూపర్ సిక్స్ హామీల తక్షణ అమలుకు అనుకూలంగా లేదు. ఒకటి, రెండు హామీలను వెంటనే అమలులోకి తెచ్చినా, కీలకమైన మరికొన్ని ఉచిత హామీల అమలుకు సమయం కావాలంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబే ప్రజలకు నేరుగా విన్నవించుకున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రతిపక్షానికి కూటమి సర్కారు తొలి రోజుల్లోనే మంచి అస్త్రాన్నే అందించింది. అయినా ప్రజలలోకి వెళ్లే పరిస్థితిలో వైకాపా లేదు. కూటమి హామీలపై క్షేత్ర స్థాయిలో పోరాటం చేయాల్సిన వైకాపా చేతులు ముడుచుకొని కూచుంది. పక్కనే వున్న తోటి తెలుగు రాష్ట్రంలో విపక్షం బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరునూ వైకాపా గమనించడం లేదు. ఏ ఒక్క సమస్యతోనూ ప్రజలలోకి వెళ్లే ప్రయత్నం చేయలేదు. తల్లికి వందనం పథకాన్ని అటకెక్కించి కూటమి సర్కారు విద్యార్థులను, తల్లిదండ్రులను రోడ్డున పడేసిందంటూ ఆరోపించిన వైకాపా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ఫీజు పోరు దీక్షకు పిలుపునిచ్చినా, దానిని కూడా వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో మార్చి 12కు ఫీజు పోరు దీక్షను వాయిదా వేశారు.**

- బాలకృష్ణ.ఎం., *ది వైర్ కోసం..*



# నేలవిడిచి సాము

రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తాయని, కోడ్ తమ దీక్షలకు అడ్డంకిగా మారు తుందన్న విషయాన్ని కూడా గుర్తించకుండా హడావుడిగా తేదీ ప్రకటించి, తిరిగి వాయిదా వేసుకొని అభాసు పాలయ్యారు. తెలుగుదేశం నేతలు ప్రజల దగ్గరకు వెళ్లే పరిస్థితి లేదని, వాళ్లను ప్రజలు తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్నారని చెబుతున్న వైకాపా అధినేత జగన్ మాత్రం ప్రజలలోకి వెళ్లడంలేదు. నిజంగా కూటమి ప్రభుత్వంపై ఇప్పటికే ప్రజలు నమ్మకం కోల్పోతే.. అది వైకాపాకు మంచి అవకాశం కదా.. ప్రజా క్షేత్రంలో పార్టీపై నమ్మకాన్ని పెంచుకొనే పని చేయకుండా, విలువలు, విశ్వతనీయత అంటూ మీడియా ముందు ఎంత అరచి గీపెట్టినా చెవిటివాని ముందు శంఖం ఊదడమే అవుతుంది.

ప్రజలే వెతుక్కుంటూ వచ్చి అధికార పళ్లెం తమ చేతిలో పెడతారని, రాబోయే మూడు దశాబ్దాల అధికారం తమదేననే ధీమా మాత్రం వైకాపాలో కనిపిస్తోంది. కనిపించడమేంటి వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డే స్వయంగా ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారం తమదే నని, అప్పుడు 2.0 జగన్‌ను చూస్తారంటూ ఆయనే చెప్పుకున్నారు. అయితే జగన్ ప్రకటనలు, జగన్ 2.0 వ్యాఖ్యలు జనాలకు రుచించడంలేదు. ప్రజలు మాత్రం విపక్ష పాత్రలో జగన్ 2.0ను చూడాలనుకుంటు న్నారు. విపక్షం ఎప్పుడు తమ తరఫున పోరాటం ఎప్పుడు చేస్తుందా అని ఒక వర్గం ప్రజలు ఆశగానే ఎదురుచూస్తున్నారు. అధికారం వచ్చాక జగన్ మారడంకాదు, కూటమి ప్రభుత్వంపై పోరాట తీరులోనూ మార్పు రావాలి.

2014 ఎన్నికల్లో వైకాపా విజయం సాధించలేకపోయినా ఏకంగా 67 సీట్లు సాధించి బలమైన ప్రతిపక్షంగా ఉంది. ఆ సమయంలోనూ రాష్ట్ర సమస్యలు, విధా నాల విషయంలో అధికార పక్షానికి విలు వైన సూచనలు ఇచ్చిందీ లేదు. అసెంబ్లీలో వైకాపా సభ్యుల వ్యవహార శైలి కూడా విమర్శలకు తావిచ్చింది. తమ నాయకుడి తత్వం వంటపట్టించుకోని 20 మంది ఎమ్మెల్యేలు టీడీపీ వైపు ఆకర్షితులై చంద్ర బాబుకు జైకొట్టారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో చర్యలు తీసుకోవడం లేదంటూ స్పీకర్‌పైనే తీవ్ర వ్యాఖ్యలు చేసి, చివరి రెండేళ్లు సభాకార్యకలాపాలనే బహిష్కరిం చారు. సభా సంప్రదాయాలు పాటించ కుండా వైకాపా ప్రజాస్వామ్యాన్నే అప హస్యం చేసిందన్న విమర్శలకు గురైంది.

రాజధాని అమరావతి విషయంలోనూ సభలో ఓమాట, బయట మరోమాటగా సాగింది. అయినా కూటమి విచ్ఛిన్నం కావడం, ప్రజాక్షేత్రంలోకి జగన్ వెళ్లడం 2019లో

- మిగతా చివరి పేజీలో




## ప్రమాద బాధితునికి రూ.10వేలు 'హెల్పింగ్'




(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పితాతొలి గ్రామానికి చెందిన త్రినాథ్‌శెట్టి వికలాంగుడు. ఇటీవల ప్రమాదంలో అతనికి కాలు విరి గింది. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు త్రినాథ్ శెట్టి చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు కాతిల లలిత, నీలాపు దుర్యోధన, సావాడ గణేష్‌రెడ్డి, దక్కత శంకర్, దుర్గాసి రవి, నీలాపు హేమరాజు, నీలాపు వంశీ, పితాతొలి గ్రామస్తులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# మోహన్ భగవత్ వ్యాఖ్యలు ఐక్యతకే విఘాతం

భిన్నత్వంలో ఏకత్వం ఉంటుందనే సత్యాన్ని హిందూ సమాజం విశ్వసిస్తుంది అంటూనే, ఆరెస్సెస్ ఛీఫ్ మోహన్ భగవత్ 'హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి' అని ఉద్బోధ చేస్తున్నారు. కుల, మత, భాషా, సాంస్కృతిక పరంగా వైవిధ్యభరితమైన దేశం మనది. ఇంత భిన్నత్వంలో అందరిని ఐక్యంచేసే ఏకాత్మకతే 'భారతీయత'! కానీ, మోహన్ భగవత్ వ్యాఖ్యలు నేడు ఆ ఐక్యతకే విఘాతం కల్గిస్తున్నాయి. 'మతమనేది వ్యక్తిగతం. దాన్ని వీధుల్లోకి, విమర్శల్లోకి తీసుకురాకండి.' అని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలో గట్టిగా నిర్దేశించినా వాటిని ఇలాంటి నేతలు పట్టించుకున్న పాపాన పోలేదు. అందుకే ఆర్ఎస్ఎస్ ఛీఫ్ నోట తరచూ ఇలాంటి మాటలే దొర్లుతున్నాయి. 'గడప లోపలే మతం, కులం గడప దాటితే మనమంతా హిందువులం' అని వల్లెవేస్తూనే.. 'భిన్నత్వంలో ఏకత్వం ఉందని విశ్వసిస్తున్నాము' అనడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనం. ఇలా చెప్పడమంటే కుల, మత విద్వేషాన్ని చిమ్మడమే. మత స్వేచ్ఛ కలిగిన దేశాన మత విద్వేషం రెచ్చగొట్టటం, దేవుళ్లను ముందు పెట్టి ప్రజలను విభజించటం సహించరాదని 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా మళ్లీ మళ్లీ చెప్పుకోవాల్సి రావటం అత్యంత విషాదం. గత పదేళ్లుగా మతం పేరుతో జరుగుతున్న అనేక సంఘటనలు మానవత్వానికి, మన రాజ్యాంగ విలువలకి పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. హత్యలు, లైంగికదాడులు, దాడులు, దహనాలూ, సాంస్కృతిక పరమైన వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్న చర్యలూ సమాజాన్ని కలవరపెడుతున్నాయి. విద్వేష పూరిత వాతావరణాన్ని కొందరు ఎందుకు సృష్టిస్తున్నారంటే కొన్ని అంశాల్లో ప్రజల దృష్టిని మరల్చేందుకు అని అన్నది నూటికి నూరు శాతం యదార్థం. అసలు విషయమంతా అందులోనే ఉంది. సమాజంలోని మనమంతా ఒక్కటే. మనకు కావాల్సింది సమతా ధర్మం. ఎవరు ఏ మతాన్ని విశ్వసిస్తారు. ఏ దేవుడ్ని పూజిస్తారన్నది వ్యక్తిగతం. అది ఇంటి లోపలే వుండాలి. గడప దాటితే మనమంతా భారతీయులం. ఎవరి స్వేచ్ఛవారిది. కాదనే హక్కు ఎవరికీ లేదు. అసలైన దేశభక్తి మనషులను మనుషులుగా ప్రేమించడంలో ఉంది. 'అన్నదమ్ములవలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయి' అని వందేళ్ల కిందటే మహాకవి గురజాడ చెప్పిన మాటలు ఇంకా మతోన్మాదుల బుర్రకెక్కలేదు. ఒకవైపు ప్రజలు ఆకలి, దారిద్ర్యం, అనారోగ్యం, ఉపాధి లేమితో ఇక్కట్లు పడుతుంటే, పెరుగుతున్న ధరలతో జీవనం కష్టసాధ్యమవుతుంటే, వారి సమస్యలను పరిష్కరించాల్సిన అధికారగణం, వారి దృష్టి మరల్చి భావోద్వేగాలను రెచ్చగొట్టి తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. అందుకోసం ప్రజలను విభజిస్తున్నారు. ద్వేషం అనేది దేవునిలో ఉండదు. అధికార దాహంలో ఉంటుంది. తోటి మనుషుల హృదయాలను గాయపరిచేవాడు, వారిని హతమార్చే రాక్షస హృదయుడు దేవుని భక్తుడు ఎలా కాగలుగుతాడు! ఈ పరివారపు మదినిండా విద్వేషమే కాని ప్రేమకు, భక్తికి తావే వుండదు. అన్యాయాలు, అమానవీయతలు కొనసాగుతూనే ఉంటాయి. సామాన్య ప్రజలు సమిధలవుతూనే ఉంటారు. ఈ 21వ శతాబ్దంలో మతం పేరుతో ఎక్కడికి పోతున్నాం మనం? దేశం లౌకిక, సౌభ్రాతృత్వ దేశంగా ఉండాలని దేశ రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. దేశ సమగ్రతను కాపాడుకోవాలని, భిన్న మతాలు, కులాలు, ప్రాంతాలు ఉన్న దేశాన్ని ప్రజాస్వామ్య విలువలతో నిలుపుకోవాలని, అందుకు ప్రభుత్వాలు పూనుకోవాలన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు ఇలాంటి నేతల చెవికి ఎప్పుడు ఎక్కుతాయో ఏమో. నిజమైన భక్తి భావన గలవారిలో మూఢత్వాలు, విద్వేషాలు, మత దురహంకారాలు కనపడవు. ఇంకా అనేక సందర్భాల్లో మతాలకతీతంగా పరస్పర సహాయ సహకారాలు అందించుకున్న ఘటనలే చాలా ఉన్నాయి. కాబట్టి గుర్తించాల్సిన అంశమేమంటే.. విశ్వాసాలను, భక్తిని, మతాన్ని ఆసరా చేసుకుని కొందరు ఆధిపత్య రాజకీయ ప్రయోజనాల కోసం వైరుధ్యాలను సృష్టించి, విద్వేషాలకు పాల్పడేవారు పెరుగుతున్నారు. నేడు మనదేశంలో ఇది అత్యంత ప్రమాదస్థాయికి చేరుకున్నది. ఇది ఇండియా హేట్ ల్యాబ్ నివేదిక తెటతెల్లం చేసింది. 2024లో దేశంలో 1,165 విద్వేష ప్రసంగాలు ఇచ్చారని, 2023 కంటే 74 శాతం అధికమని ఈ నివేదిక పేర్కొన్నది. ముస్లింల తర్వాత క్రైస్తవులు లక్ష్యంగానే ఈ విద్వేష ప్రసంగాలు చేసినట్టు ఇండియా హేట్ ల్యాబ్ వెల్లడించింది. బీజేపీ, ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో వీటి సంఖ్య ఘననీయం అని స్పష్టం చేసింది. వీటి ఫలితాలు అత్యంత అమానవీయంగా ఉంటున్నాయి. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతీయసామాజిక విలువలను ధ్వంసం చేయపూనుకుంటున్నాయి. వైయక్తిక విశ్వాసాలను, భక్తిని రాజకీయాల్లోకి తీసుకొచ్చి సమాజంలో ఉన్న ఐక్యమత్యాన్ని, సహనాన్ని విచ్ఛిన్నం చేయచూస్తున్న వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. విద్వేషాలను నిలదీయాలి, నిలువరించాలి.




పొద్దున్నే వార్తలు చదవకపోతే బాగుండు అనిపిస్తుంది ఒక్కోసారి. చదివితే.. "నిండా మునిగిన వాడికి చలేమిటి? గిలేమిటి?" "ఒకేసారి అటు గోడదెబ్బ- ఇటు చెంప దెబ్బ".. లాంటి ఏవేవో సామెతలను గుర్తు చేసుకుని మనల్ని మనమే ఓదార్చుకోవాల్సి వస్తుంది. అలాంటి ఒకానొక వార్త ఇది.


## దారి చూపని దేవతా..

# ఈ టోల్‌గేట్ ఎన్నడూ వీడక!!

జాతీయ రహదారుల్లో టోల్‌బూత్‌ల దగ్గర ఫాస్ట్ ట్యాగ్‌లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోయినా, ఫాస్ట్ ట్యాగ్ బ్లాక్‌లిస్ట్‌లో ఉన్నా పెనాల్టీగా డబుల్‌ఛార్జ్ వసూలు చేసేలా రాత్రికి రాత్రే నిబంధనలను మార్చి ఆలస్యం కాకుండా సూర్యుడు ఉదయించగానే సోమవారంనుండి అమల్లో పెట్టారు. చందమామకథల్లో దారికాచి దోచుకునే దొంగల కథలు.. గుర్రాలమీద గుంపులుగా వచ్చి సర్వం దోచుకునే బందిపోటు దొంగల ముఠాల కథలు.. దారికి రాళ్ళు అడ్డం పెట్టి పెళ్ళిళ్ళకు వెళ్ళేవారినుండి నగలను మాత్రమే దోచుకునే సీజనల్ దొంగల కథలు.. ఇలా ఎన్నెన్నో విన్నాం. కన్నాం. ఆధునిక సైబర్ దోపిడీలు అనుభవిస్తున్నాం.

పై కథలన్నిటికి ఈ ఫాస్ట్ ట్యాగ్ దోపిడీ తాతలాంటిది. ఇంకా చెప్పాలంటే ముత్తాతలాంటిది. సాధారణంగా పంటకు రక్షణ కంచె. అలాంటి కంచే చేను మేస్తే దేవుడే దిక్కు. వెనకటికి జంధ్యాల నాటకంలో ఒక పదవీ విరమణ పొందిన బడుగు జీవి ప్రభుత్వ కార్యాలయానికి వెళతాడు. తనకు రావాల్సిన పెన్షన్ తాలూక ఎరియర్స్ ఎప్పుడొస్తాయని అడుగుతాడు. "ఇన్నేళ్లుగా తిరుగుతూనే ఉన్నావు నువ్వు. అడిగిన అన్ని కాగితాలు ఇచ్చావు! నువ్ బతికి ఉన్నట్లు ఇంకొక్క కాగితమిస్తే.." అంటాడు ఉద్యోగి. మనవైపు తిరిగి ఆ బడుగు జీవి- "అయ్యో నేనింకా బతికే ఉన్నానా? చావలేదా?" అంటాడు. ప్రేక్షకుల కరతాళధ్వనులతో హాలు హాలంతా మారుమోగిపోయేది.

వెనకటికి సామాజిక సమస్యలమీద ఇలా పదునైన ప్రదర్శనలైనా కర్తవ్యాన్ని గుర్తు చేసేవి. ఇప్పుడు జగన్నాటకంలో ఎవరి నాటకం వారిది కావడంతో సమాజాన్ని పట్టి పీడించే సమస్యలు తెరమరుగై మన మొహాలే ముఖపుస్తకంలో,


ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకుంటే..

డబుల్ టోల్ బాదుడు

» బ్లాక్ లిస్టులో ఉన్నా జరిమానా

» అమల్లోకి కొత్త నిబంధనలు: ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఫాస్టాగ్ వినియోగదారులు ఇకపై బ్యాలెన్స్ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. టోల్ చార్జీకి తగిన బ్యాలెన్స్ లేకున్నా.. బ్లాక్‌లిస్టులో ఉన్న కార్డును వాడినా.. జరిమానాల బాదుడు తప్పదు. ఈ మేరకు భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలను ప్రకటించింది. ఈ నిబంధనలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి. టోల్‌బూత్‌ల వద్ద వాహనాల రద్దీకి బ్లాక్‌లిస్ట్ ఫాస్టాగ్‌లు, లోబ్యాలెన్స్ వంటి అంశాలు కారణాలుగా ఉంటున్న నేపథ్యంలో.. తాజా నిబంధనలను అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఎన్‌పీసీఐ వెల్లడించింది. ఫాస్టాగ్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ (రూ.100) లేకపోతే.. దాన్ని రీచార్జ్ చేయకుంటే బ్లాక్‌లిస్టులోకి వెళ్తుంది. ఫాస్టాగ్ అందించే బ్యాంకుకు సమయానికి కేవైసీ అందించకున్నా.. వాహన రిజిస్ట్రేషన్ వివరాల్లో తేడాలున్నా బ్లాక్‌లిస్ట్ లేదా హాట్‌లిస్టులో పెడతారు. ఒకవేళ బ్లాక్‌లిస్టులో ఫాస్టాగ్ ఉంటే.. టోల్ బూత్‌ను చేరుకోవడానికి 60 నిమిషాల ముందే రీచార్జ్ చేసుకుని, కేవైసీని సమర్పించి.. అన్‌బ్లాక్ చేసుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా.. బ్లాక్‌లిస్టులో ఉండగానే టోల్ దాటితే.. 'ఎర్రర్ కోడ్ 176'గా పరిగణిస్తారు. దీంతో.. టోల్ చార్జీకి సమానంగా జరిమానా పడుతుంది. అంటే.. టోల్ చార్జీకి రెట్టింపు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఎర్రర్ కోడ్ 176 వచ్చినప్పుడు.. 10 నిమిషాల్లోపు రీచార్జ్/అన్‌బ్లాక్ చేసుకుంటే.. జరిమానా మొత్తం వెనక్కి వస్తుంది. ఈ నేపథ్యంలో సేవింగ్ అకౌంట్స్ ఉన్న బ్యాంకు నుంచే ఫాస్టాగ్ తీసుకుంటే.. యాప్‌లో 'ఆటో రీచార్జ్' విధానాన్ని అనుసరించడం మంచిది. అంటే.. బ్యాలెన్స్ మొత్తం రూ.200 లేదా రూ.300 కంటే తక్కువ ఉంటే.. నిర్దీత మొత్తాన్ని ఖాతా నుంచి ఆటో రీచార్జ్ అయ్యేలా సెట్టింగ్స్‌లో ఆప్షన్లను ఎంచుకోవచ్చు.

Courtesy: Andhra Jyothi

ఇన్‌స్టాలో రీళ్ళు రీళ్ళుగా తిరుగుతున్నాయి. మన తోలు ఒలిచే టోలుగేట్ల గురించి గతంలో ఎన్నోసార్లు మాట్లాడుకున్నాం. "అదే నువ్వు- అదే నేను- అదే గీతం పాడగా.." అన్నాడు ఆత్రేయ బాధగా. "అదే టోల్ గేట్- అదే మనం- అదే దోపిడీ.." అని మనం కూడా అదే గీతం పాడుకోవాలి బాధగా. ఫాస్ట్‌ట్యాగ్‌లో ముందుగా చెల్లించే సొమ్ము దేశవ్యాప్తంగా ఎన్ని వందల, వేల కోట్లు జమ అయి ప్రభుత్వ ఖజానాలో మూలుగుతూ ఉంటుందో! ఏటా దగ్గర దగ్గర అక్షరాలా లక్ష కోట్ల రూపాయలు వాహనదారులు దారుల్లో టోల్ గేట్లకు కడుతున్నా ప్రభుత్వం ఇంకా వసూళ్ళు పెంచడానికి కొత్తదారులు ఎందుకు వెతుకుతోందో! తెలిస్తే ఎర్రగడ్డ మన గుమ్మం ముందుకు నడిచి వస్తుంది.

ఒక అరవై కిలోమీటర్ల నాలుగు వరుసల జాతీయ రహదారి. కిలోమీటర్ నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ లెక్కప్రకారం తక్కువలో 8 నుండి అత్యధికంగా 14 కోట్ల ఖర్చు. అంటే అరవై కిలోమీటర్లకు 840 కోట్ల ఖర్చు. దీనికి వడ్డీ, భూ చక్ర విష్ణు చక్ర వడ్డీ లెక్కలు కలుపుకుని పదేళ్ళకు 1500 కోట్లు అవుతుందనుకుందాం. మనం ఎన్ని లక్షలకోట్లు పన్నులు కట్టినా ఉచితాలకు ఉచితానుచితాలు మరచి బాధ్యతగల మనం ఎన్నుకున్న ప్రభుత్వాలు పోటీలుపడి పంచి పెట్టాలి కాబట్టి.. దయగల ప్రభుత్వాల దగ్గర రోడ్లు వేయడానికి, ఆసుపత్రులు, బడులు కట్టడానికి డబ్బులు ఉండి చావవు. దాంతో ప్రయివేటు వారితోనే వేలకు వేల కిలోమీటర్ల రోడ్లు వేయించాలి. వారు ముందు డబ్బు పెట్టి తరువాత బాధ్యతగల భారతీయ పౌరులనుండి వసూలు చేసుకోవాలి. ఇంతవరకు బాగానే ఉంది. కలిలో ధర్మం ఒంటికాలిమీదే నడుస్తుందని ముందే చెప్పేశారు కాబట్టి ఇంతదాకా దోపిడీ ధర్మబద్ధమే అనుకుందాం. ఆ అరవై కిలోమీటర్ల దారిలో మనం 1500 కోట్లు చెల్లించిన తరువాత పదిహేను, పాతికేళ్ళయినా ఆ టోల్ గేట్ ఎందుకు మాయం కాదో! మనం పట్టించుకోము. అసలు, వడ్డీ, లాభాలు కట్టాక ఒకటి, రెండు తరాలుగా మనం కడుతున్నది ఎవరి జేబుల్లోకి వెళుతోందో! మనమెప్పుడూ ఆరా తీయము. నాగరిక సమాజంలో మనం కట్టే పన్నులు ఎటు వెళుతున్నాయో? ఏ రూపంలోకి మారుతున్నాయో? తెలుసుకోవాల్సిన బాధ్యత మనదే. అడిగేవాడు లేకపోతే ఇలాగే ఉంటుంది. టోల్ గేటే పెద్ద తలతిక్క లెక్క అయితే దానికి మినిమమ్ బ్యాలెన్స్, బ్లాక్ లిస్ట్, డబుల్, ట్రిబుల్ పెనాల్టీ వసూళ్ల లెక్కలేమిటో? ఖర్మ కాకపోతే!

**రావాల్సిన పెన్షన్ ఎరియర్స్ రానందుకే జంధ్యాల బతికి ఉన్నానా? ఇంకా పోలేదా? అనిపించాడు పాత్రచేత. భారత జాతీయ చెల్లింపుల సంస్థ(ఎన్ పి సి ఐ) తాజా ఫాస్ట్ ట్యాగ్ కొరడా దెబ్బలు, పట్టపగటి దోపిడీలను చూస్తే ఏమనిపించేవాడో! పోయాడు కాబట్టి బతికిపోయాడు! మనం టోల్ గేట్ల దగ్గర పోలేక చచ్చే చావు చస్తున్నాం!**

**- పమిడికాల్వ మధుసూధన్**

చారిత్రక ఘట్టాలు, సంఘటనలను పాఠాల్లో చెప్పినంత సులభం కాదు వెండితెరపై ఆవిష్కరించడం. అవి రక్తికట్టాలంటే, నటుడు ఆ కథా ప్రపంచంలో ఉన్నట్లు ఊహించుకోవాలి. ఆ పాత్రల ఆహార్యాన్ని ఔపోసన పట్టాలి. వాటి తాలూకా జీవాన్ని ఆవాహన చేసుకోవాలి. అప్పుడే ఆ చిత్రాలు అజరామరం అవుతాయి. ప్రస్తుతం హిందీ చిత్ర పరిశ్రమలో ఆ పని చేస్తున్నాడు విక్కీ కౌశల్. నిజ జీవిత పాత్రలను పోషిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టి, ఒక్కో మెట్టు ఒకవైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే, వైవిధ్యమైన పాత్రలతో తనలోని నటుడికి సాన పెడుతున్నాడు. 'సర్దార్ ఉద్దమ్', 'సామ్ బహదూర్' సహా తాజాగా థియేటర్‌లో అదరగొడుతున్న 'ఛావా' పాత్రలన్నీ అలా వచ్చినవే.



దాదాపు రెండున్నర గంటల 'ఛావా'లో విక్కీ రాజుగా రాజసం ప్రదర్శించాడు. మాట తూలిన సహచరులను కోపంతో గద్దించాడు. శత్రుసేనలపై రుద్ర తాండవం చేశాడు. వీటన్నింటినీ మించి 'శ్రీసఖి' అంటూ భార్యను ప్రేమగా పిలిచే సగటు భర్తగా కనిపించాడు. శంభాజీ పాత్ర కోసం తనని తాను చెక్కుకున్నాడు. శారీరకంగా మానసింగానూ సిద్ధమయ్యాడు. వీరుడిలా కనిపించేందుకు 100కేజీలకు పైగా బరువు పెరిగాడు. అక్కడితో ఆగిపోలేదు. గుర్రపు స్వారీ, కత్తిసామే కాదు, పోరాట యోధుడి పాత్రకు ఏది అవసరమైతే దాన్ని తనలో ఆవాహన చేసుకున్నాడు. 'ఛావా' కథాగమనం అక్కడక్కడా ఇబ్బందులు పడినా, విక్కీ తన ఆరాతో అవేవీ కనపడనీయకుండా చేశాడు.

VICKY KAUSHAL

## విక్కీ కౌశల్..

# విలక్షణ నటుడు!

ఒక రకంగా 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' విక్కీ కౌశల్ కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమా. అందులో సైనిక కమాండోగా అదరగొట్టారు. ఇక 'సర్దార్ ఉద్దామ్' అంటూ ఆ పాత్ర కోసం విక్కీ పడిన కష్టం తెరపై కనిపించింది. 40ఏళ్ల వయసులో 20ఏళ్ల కుర్రాడిలా కనిపించడం కోసం ఎంతో తపించాడు. 14కేజీల బరువు తగ్గి, ఆ తర్వాత అంతే బరువు పెరిగాడు. ఉద్దామ్ సింగ్ ప్రయాణంలో ఆ మార్పును మనం చూడొచ్చు. 'ఆ పాత్ర చేస్తున్నప్పుడు శారీరకంగా మానసికంగా ఎంతో కష్టపడాల్సి వచ్చింది' అని చెబుతుంటాడు.

ఇక భారతదేశ ఫస్ట్ ఫీల్డ్‌మార్షల్ శ్యామ్ మానెక్‌షా జీవిత కథ 'సామ్ బహదూర్'లో ఒదిగిపోయాడు. కేవలం ఆ పాత్రను ఆకళింపు చేసుకోవడానికే రెండు మూడేళ్ల సమయం కేటాయించాడు. గంటల తరబడి మానెక్‌షా వీడియోలను, ఆయన గురించిన ఆర్టికల్స్‌ను చదువుతూ పాత్రకు సిద్ధమయ్యాడు. 'మానెక్ షా నడక, మాటతీరు విభిన్నంగా ఉంటుంది. దాని కోసం చాలా పరిశోధన చేయాల్సి వచ్చింది. ఆయన ఇంటర్వ్యూలు పదేపదే చూసేవాడిని. వారి కుటుంబ సభ్యులను కలిసి ఎన్నో విషయాలు నోట్స్ రాసుకునేవాడిని. రెండు, మూడేళ్లు సాధన చేసిన తర్వాత ఆయనలా నడవడం సాధ్యమైంది. అలాగే సంభాషణలు కూడా ఆయనలా అనుకరించడానికి సాధన చేశా" అంటూ తాను పడిన శ్రమను పంచుకుంటాడు విక్కీ కౌశల్.

చారిత్రక పాత్రలు చేయాలనుకున్న ప్రతి ఒక్కరూ విక్కీ కౌశల్‌లో ఉన్న ఓ విశిష్టతను గుర్తించాలి. మొదట ఆ పాత్రను మనం చేయగలమా? లేదా? అన్నది అంచనా వేయాలి. ఆ పాత్రలో పరకాయ ప్రవేశం చేయాలి. ఆఖరికి ఆ పాత్రగా మారిపోవాలి. అప్పుడే సినిమా మెరుస్తుంది.. కాసులు కురిపిస్తుంది. విక్కీ 'ఛావా'తో ఆగిపోయే రకం కాదు.. తనలో చేవ ఉన్నంత వరకూ చేసే రకం. భవిష్యత్‌లో మరిన్ని పాత్రలు ఆయన నుంచి రావడం ఖాయం..!!





## పూజాహెగ్డేకు సూపర్ చాన్స్

ఈమధ్య పూజాహెగ్డే పేరు పెద్దగా వినిపించడం లేదు. కొత్తమ్మాయిల హవా వల్ల పూజా కాస్త సైడ్ అయ్యింది. ఇప్పుడు తనకు ఓ సూపర్ ఛాన్స్ వచ్చిందని తెలుస్తోంది. రజనీకాంత్ సినిమాలో తాను ఓ ప్రత్యేక గీతం చేయబోతున్నట్టు ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి.

రజనీకాంత్- లోకేష్ కనగరాజ్ కాంబోలో 'కూలీ' అనే ఓ చిత్రం రూపుదిద్దుకొంటున్న సంగతి తెలిసిందే. ఇందులో నాగార్జున ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఓ ప్రత్యేక గీతం ఉంది. ఆ పాటలో పూజా హెగ్డే కనిపించే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల పూజాతో.. చిత్రబృందం సంప్రదింపులు జరిపిందని, పూజా కూడా ఈ పాటలో నర్తించడానికి ఒప్పుకొందని సమాచారం అందుతోంది. పూజాహెగ్డేకి ఐటెమ్ గీతాలు చేయడం కొత్తేం కాదు. 'రంగస్థలం', 'ఎఫ్ 3'లాంటి చిత్రాల్లో ఐటెమ్ భామగా మెరిసింది. అయితే సూపర్ స్టార్ రజనీకాంత్ తో కలసి నటించడం ఇదే తొలిసారి. కాబట్టి తనకు ఇది మంచి అవకాశమే. పైగా ఇది లోకేష్ కనగరాజ్ సినిమా. ఎన్ని విధాలుగా చూసినా పూజాకు ఇది మంచి అవకాశం. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

**తెలుగు ,తమిళ, మలయాళ సినిమాలతో సౌత్‌లో మంచినటిగా గుర్తింపు తెచ్చుకున్న సంయుక్త "భీమ్లా నాయక్" సినిమాతో తెలుగు ఎంట్రీ ఇచ్చింది . సాగర్ చంద్ర దర్శకత్వంలో తెలుగు ఆడియన్స్‌కు పరిచయమైన ఈమే భామ ప్రేక్షకుల కంట్లో పడింది. విరూపాక్ష సినిమాలో తన నటనతో అందరినీ ఆకట్టుకోవడంతో పాటూ మంచి నటిగా కూడా పేరు తెచ్చుకుంది సంయుక్త.**

ఓ వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు సోషల్ మీడియాలో తన ఫోటోలను, షేర్ చేస్తూ ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటుంది. సంయుక్త సోషల్ మీడియాలో ఆక్టివ్ తనకు మందు కొట్టే అలవాటుం దని, కానీ రెగ్యులర్‌గా కొట్టను అని, స్ట్రెస్ రిలీఫ్ కోసం కొంచెం తీసుకుంటానని నిజం చెప్పింది. భీమ్లానాయక్ మూవీతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన సంయుక్త మీనన్ ఆ తర్వాత కళ్యాణ్ రామ్ సరసన బింబిసారలో నటించింది. సాయిధరమ్ తేజ్ సరసన విరూపాక్ష సినిమా చేసి హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. తమిళంలో ధనుష్ సరసన చేసిన "సార్ "సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో సౌత్‌లో సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అయ్యింది. ఇప్పుడు బింబిసార2, స్వయంభు, అఖండ2 సినిమాలతో బిజీగా ఉంది సంయుక్త మీనన్.

# మందు కొడతా!!



# మనుస్మృతిని ధిక్కరించిన.. ఛత్రపతి శివాజీ!



అయితే ముస్లింల పట్ల, వారి మతం పట్ల శివాజీ ఎప్పుడూ ద్వేషభావం చూపలేదు..అని చరిత్రకారుడు సర్దేశాయి 'న్యూ హిస్టరీ ఆఫ్ మరాఠాస్' అనే తన పుస్తకంలో రాశారు. సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించడమే శివాజీ ప్రాథమిక లక్ష్యంగా జీవితాంతం పోరాడాడు. అంతేగాని, ఆయన ఎప్పుడూ ముస్లిం ద్వేషి కాదు. ఇస్లాం వ్యతిరేకీ కాదు. అలా చూపించడానికి ప్రయత్నించిన వారు వాస్తవాల్ని వక్రీకరించినట్లవుతుంది.

మతం ప్రాతిపదికన కాకుండా మానవీయ కోణంలో ఛత్రపతి శివాజీ పరిపాలన సాగించాడు. సైన్యంలో, ఇతర అధికారుల నియామకాల్లో మతానికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వలేదు. అతని సైన్యంలో ఎక్కువ మంది ముస్లింలే. రాజ్యాన్ని రక్షించాల్సిన సైన్యంలో ఆయన నిర్భయంగా ముస్లింలను నియమించుకోవడం, వారి మీద నమ్మకం పెంచుకోవడం గమనించాల్సిన విషయం. అలాంటి వాణ్ణి ముస్లిం వ్యతిరేకిగా చిత్రించడమంటే వారి అవగాహనా రాహిత్యాన్ని బయట పెట్టుకున్నట్లే. అలాగే ఇతర మత పెద్దలను కూడా శివాజీ ఎంతో గౌరవించేవాడు. హజ్రత్‌బాబా యాకుబ్ తొర్వాలే పట్ల శివాజీకి ఎంతో గౌరవభావం వుండేది. జీవితాంతం ఆయనకు పింఛను అందేలా ఏర్పాటు చేశాడు. ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు తన రాజధాని రాయగఢ్‌లో ప్రత్యేకంగా మసీదు నిర్మించాడు. రాజ్యంలోని, మసీదులకు, దర్గాలకు రక్షణ కల్పించాడు. ఎవరికైనా ఖురాన్ దొరికితే దాన్ని గౌరవంగా తీసుకెళ్లి ముస్లింలకు అప్పగించాలన్న ఉత్తర్వు అమలులో ఉండేది. అలాగే ఫాదర్ అంబ్రోస్ పట్ల కూడా శివాజీకి ఎంతో గౌరవం వుండేది. గుజరాత్ దాడిలో ధ్వంసమైన చర్చి పునర్నిర్మించడానికి భూరి విరాళం అందించాడు.

యుద్ధ సమయంలో చేతికి చిక్కిన ఇతర మతాల మహిళల పట్ల, పిల్లల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని సైన్యానికి ఆదేశాలుండేవి. అఫ్జల్‌ఖాన్‌ను శివాజీ హత్య చేయడాన్ని కొందరు వక్రీకరించారు. ఆదిల్షా రాజులకు శివాజీకి ఏళ్ల తరబడి యుద్ధం సాగుతున్న తరుణంలో, ఆదిల్షా రాజ్యానికి ప్రతినిధిగా అఫ్జల్ ఖాన్ పోరాడాడు. చర్చల పేరుతో శివాజీని తన గుడారానికి ఆహ్వానించి చంపడానికి కుట్ర పన్నాడు. అయితే ఆ కుట్ర వివరాలు ఒక ముస్లిం ద్వారా శివాజీ తెలుసుకున్నాడు. అంటే హిందువయిన శివాజీ మహారాజును రక్షించుకున్నది ముస్లిం అయిన రుస్తుం జమాన్. రుస్తుం జమాన్ సూచన మేరకే శివాజీ ఇనుప పంజాలు ధరించి అఫ్జల్‌ఖాన్‌ను చంపేశాడు. ఇక్కడ మనం కృష్ణాజీ భాస్కర్ కులకర్ణి పోషించిన పాత్రను విశ్లేషించుకుంటే, మనకు అర్థమయ్యేదేమంటే.. తన మతం వాడయినా సరే.. తక్కువ కులం వాడు రాజుగా ఉండటం భరించలేక శివాజీని చంపడానికి వేరే మతం వాడికి సహాయపడ్డాడు. సరే, ఆ పథకం విఫలమైందన్నది వేరే విషయం.

ప్రజారంజకుడైన మహారాజు ఛత్రపతి శివాజీ మనుస్మృతిని ధిక్కరించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? శివాజీ మరాఠా 'కున్బి' కులస్తుడు. మనుస్మృతి ప్రకారం శూద్రకులం. అగ్రవర్ణాల వారు శూద్ర కులాలను బానిసలుగా మార్చిన విషయం గతం చెపుతోంది. దేశ జనాభాలో తొంభై శాతం ఉన్న ఈ 'శూద్రులు' అగ్రవర్ణాల వారు రచించుకున్న మనుస్మృతి ప్రకారం చదువుకోకూడదు. ఆయుధం ఉపయోగించకూడదు. వారికి ఎదురుపడకూడదు. కేవలం వారి వారి చేతివృత్తులు చేసుకుని జీవించాలి. పైగా తమ రాబడిలో సగభాగం అగ్రవర్ణ పెత్తందారులకిచ్చి, మిగతా సగంతోనే జీవించాలి. ఈ కట్టుబాట్లను ఎవరైనా ధిక్కరిస్తే నాలుకలు కోసేవారు, చెవుల్లో సీసం పోసేవారు. రాజైన శివాజీకే వివక్ష తప్పలేదు. శివాజీని పట్టాభిషిక్తుణ్ణి చేయడానికి స్థానిక బ్రాహ్మణు లెవరూ సహకరించలేదు. అప్పుడు దూరప్రాంతం నుంచి ఒక బ్రాహ్మణ్ణి పిలిపించారు. అతను కార్యక్రమం పూర్తి చేయించాడు కానీ, శివాజీ నుదుట తన కాలి బొటనవేలుతో తిలకం దిద్దాడు. ఎందుకంటే రాజైనవాడు శూద్రుడు గనక! ఇటువంటి పరిస్థితి సమకాలీనంలో కూడా మారలేదు.

మనుస్మృతి నిబంధనలు కఠినంగా అమలులో ఉన్న ఆ కాలంలో శూద్రుడై ఉండి శివాజీ ఆయుధం చేపట్టాడు. జ్ఞాని అయ్యాడు. సర్వమత సహనంతో ప్రజల్ని సమభావంతో ఆదరించాడు. అంటరాని కులాల వారికి ఆయుధమిచ్చి వారిని సైనికులుగా తీర్చిదిద్దాడు. అలాంటి శివాజీని కుట్రలు కుతంత్రాలతో అగ్రవర్ణాల వారు హత్య చేశారు. శివాజీ కుమారుడు శంభాజీ కూడా తండ్రి బాటలో నడిచాడు. మనుస్మృతిని ధిక్కరించి 'బుద్ధ భూషణం' అనే పుస్తకం రాశాడు. వేదపురాణాల్ని అధ్యయనం చేసి అవి పనికిరానివని తేల్చాడు. 'ఈ దేశానికి బౌద్ధం ఒక్కటే మార్గం' అని నిర్ణయించుకుని ప్రచారం చేశాడు. శూద్ర కులాల్ని చైతన్యపరిచాడు. అయితే శూద్రకులాలు బలపడితే తమకు ప్రమాదమని అగ్రవర్ణాల వారు ఔరంగజేబు సహాయంతో శంభాజీని, అతని అనుచరుల్ని బంధించారు. మనుస్మృతిలో చెప్పినట్టు కళ్ళు పీకి, చర్మం వొలిచి, నాలుక కోసి అతిక్రూరంగా హత్య చేశారు. శంభాజీ తలను, అతని అనుచరుల తలలను కోసి, వారి కత్తులకు గుచ్చి పూణెలో ఊరేగించారు. మమ్మల్ని ధిక్కరించి కులధర్మాన్ని ధిక్కరించినవాడు చక్రవర్తి అయినా సరే వాడికి ఏ గతి పట్టిందో చూడండంటూ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేశారు. తమను ఎదిరిస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని హెచ్చరించారన్నమాట!

శంభాజీని ప్రోత్సహించిన అంటరాని వారికి తర్వాత కాలంలో మూతికి ముంత, నడుముకు చీపురూ వచ్చాయి. ఛత్రపతి శంభాజీ హత్యకు గుర్తే.. చెంబులో కర్రలు పెట్టి ఊరేగించడం! మహారాష్ట్రలో అది గుడిపడవా. తెలుగు ప్రాంతాల్లో ఉగాది. అందుకే ఉగాది ఏ విధంగానూ మన పండగ కాదు అనేది విశ్లేషకులు చెపుతున్న మాట. ఈ దేశ మూలవాసులకు అదొక దుర్దినం. ఛత్రపతి శివాజీ కాలం లోనే కాదు, ఈ 21వ శతాబ్దంలో కూడా ఈ కులమతాలు ఇలాగే కొనసాగాలని ఒక జియ్యరు స్వామి ఏమాత్రం సిగ్గూ, బిడియం లేకుండా చెపుతున్నారంటే ఏంటీ? మంత్రయినా, ముఖ్యమంత్రయినా సరే, తమ కాళ్ళ మీద పడాల్సిందేనని చెప్పుకోవడమన్న మాట! ఆధిపత్య కుల దురహంకారాన్ని అజ్ఞానంతో ప్రదర్శించుకోవడమన్న మాట! దీన్నిబట్టి మనం ఎన్నుకుంటున్న నాయకులు ఎలాంటి వారో అంచనా వేసుకోవచ్చు...

**- ఉయ్యాల సురేందర్**

> **రాజైన శివాజీకే వివక్ష తప్పలేదు. శివాజీని పట్టాభిషిక్తుణ్ణి చేయడానికి స్థానిక బ్రాహ్మణులెవరూ సహకరించలేదు. అప్పుడు దూర ప్రాంతం నుంచి ఒక బ్రాహ్మణ్ణి పిలిపించారు. అతను కార్యక్రమం పూర్తి చేయించాడు కానీ, శివాజీ నుదుట తన కాలి బొటనవేలుతో తిలకం దిద్దాడు. ఎందుకంటే రాజైనవాడు శూద్రుడు గనక! మనుస్మృతి నిబంధనలు కఠినంగా అమలులో ఉన్న ఆ కాలంలో శూద్రుడై ఉండి శివాజీ ఆయుధం చేపట్టాడు. జ్ఞాని అయ్యాడు. సర్వమత సహనంతో ప్రజల్ని సమభావంతో ఆదరించాడు. అంటరాని కులాల వారికి ఆయుధమిచ్చి వారిని సైనికులుగా తీర్చిదిద్దాడు.**

తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఒక్కోసారి ఒక్కొక్కరిని తమవారిగా ప్రచారం చేసుకోవడం బీజేపీ, ఆరెస్సెస్‌లకు కొత్తేమీ కాదు. వారిలో ఛత్రపతి శివాజీ ఒకరు. ప్రసిద్ధ మరాఠా నాటకం 'జాణ్తారాజా' (జగమెరిగిన రాజు)కూడా శివాజీని ముస్లిం ద్వేషిగా చిత్రీకరించింది.

## యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పాలకులు, అధికారులు చొరవ చూపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావులు కోరారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని కోరుతూ బుధవారం శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయి ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా ఇచ్చిన 20లక్షల ఉద్యోగాల కల్పన దిశగా పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మెగా డీఎస్సీ అని చెప్పి కాలయాపన చేయడం తగదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలను గుర్తించి వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక వనరులు ఉపయోగించుకొనే పరిశ్రమలు ఏర్పాటు చేసి వాటిలో స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని కోరారు. యువతకు స్వయం ఉపాధికి ప్రోత్సాహంగా సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి స్థానిక పాలకులు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి అందించాలని, ప్రతీ మండల కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటుతో పాటు, గ్రంథాలయాల్లో పోటీ పరీక్షకు అవసరం అయ్యే పుస్తకాలను అందుబాటులో ఉంచి, యువతకు ఉద్యోగ అవకాశాల కోసం కోచింగ్‌లు ఉచితంగా ఏర్పాటు చేయాలన్నారు. యువత స్వయం ఉపాధి కోసం అవకాశాలను అన్వేషించి ఆ దిశగా పాలకులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

## వైకాపా శ్రేణులు తరలిరండి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఈనెల 20న పాలకొండ పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో వైకాపా శ్రేణులంతా ఆయనకు స్వాగతం పలికేందుకు తరలి రావాలని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 20న మధ్యాహ్నం 2 గంటలకు ఇటీవల మృతి చెందిన స్వర్గీయ పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించేందుకు 20న మధ్యాహ్నం 2 గంటలకు జగన్ పాలకొండకు విచ్చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో 1 గంటకు పాలకొండలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు వైకాపా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సీనియర్ వైకాపా నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు.



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జ్యోతారావు పూలే పార్కులో ఆయన చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అమీరుల్లా బేగ్, రౌతు శంకరరావు, కిల్లాన శ్రీనివాస్, కాయిత వెంకటరమణ, గద్దిబోయిన కృష్ణారావు, నాగరాజు, విగ్రహదాత పొట్నూరు సూర్యం తదితరులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నగరంలోని గాంధీవనంలో గల శివాజీ విగ్రహానికి బూర్జ మండల ఉపాధ్యక్షులు బుడుమూరు సూర్యారావు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. చిన్నతనంలో శివాజీకి సంబంధించిన పాఠాలు చదివితే ఆ ధైర్యం, సాహసం, వ్యూహాలు, తెగువ, దేశభక్తి, పోరాటం ఎంతో విశిష్టంగా ఉండేవన్నారు.

-సత్యంన్యూస్, శ్రీకాకుళం

## కేంద్రబడ్జెట్‌పై మేధావుల సమావేశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీజేపీ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోడీ సారథ్యంలోని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ప్రజా బడ్జెట్ 2025-26పై మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం నార్త్ ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు పాల్గొని బడ్జెట్‌లో ముఖ్య అంశాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు, చార్టర్డ్ అకౌంటెంట్ ఐ.కె.రావు, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథం, అంబేద్కర్ యూనివర్సిటీ రిటైర్డ్ రిజిస్ట్రార్ తులసీరావు, కంపెనీ సెక్రటరీ బుర్రా భార్గవ్, విద్యావేత్త నిక్కు అప్పన్న, జర్నలిస్టు కొంక్యాన వేణుగోపాల్, ఎన్.జి.ఒ మణిశర్మ,, గురజాడ విద్యాసంస్థల చైర్మన్ సంయుక్త, జామి భీమశంకర్, డాక్టర్ పైడి సింధూర, పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జి, బిర్లంగి ఉమామహేశ్వర రావు, చల్లా వెంకటేశ్వర రావు, చింతపల్లి దుర్గారావు గాంధి, గొలివి కరుణాకర రావు, బూరె నరేంద్ర చక్రవర్తి, మంగి లక్ష్మీ రెడ్డిలు పాల్గొన్నారు.



## బిఎస్సీ ఫెస్ట్ ఆక్సీ-2కె25 పోస్టర్ ఆవిష్కరణ




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో వచ్చేనెల 8వ తేదీన బిఎస్సీ ఆధ్వర్యంలో జరగబోయే కంప్యూటర్ సైన్స్ ఫెస్ట్ ఆక్సీ-2కె25కు సంబంధించిన పోస్టర్‌ను ఆదిత్య డిగ్రీ & పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలు విద్యతో పాటు విద్యార్థుల తెలివితేటలను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తుందన్నారు. కాబట్టి విద్యార్థులందరూ ఫెస్టులలో నిర్వహించే వివిధ పోటీలలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ రామకృష్ణరెడ్డి, కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ప్రసాద్,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## మత్స్యకార నాయకులతో కలిసి తండేల్ సినిమా చూసిన పిన్నింటి

(సత్యంన్యూస్, రణస్థలం)

ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండల మత్స్యకార నాయకులతో కలిసి నియోజకవర్గ వైకాపా నాయకులు పిన్నింటి సాయికుమార్ తండేల్ సినిమాను మండల కేంద్రంలోని శ్రీరామాంజనేయ థియేటర్‌లో వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ తండేల్ సినిమాతో దర్శకులు శ్రీకాకుళం జిల్లా మత్స్యకారుల జీవనవిధానం, వారి స్థితిగతులు, ఉపాధి కొరకు వలసబాట పడుతూ వారు ఎదుర్కొంటున్న బాధలు కళ్ళకు కట్టినట్టు తీశారన్నారు. నటీనటుల అభినయం బాగుందన్నారు. మత్స్యకారులను పాకిస్తాన్ జైళ్ళ నుండి విడిపించేందుకు చిలకపాలెం బహిరంగసభలో జగనన్న ఇచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వైకాపా ప్రభుత్వం కేంద్రం సహాయంతో పాకిస్తాన్ నుండి విడిపించడం, వారు వచ్చిన తరువాత వారికి తక్షణ సహాయం క్రింద జగనన్న ఒక్కొక్కరికి రూ.5లక్షలు చొప్పున ఇచ్చారన్నారు. అదే విధంగా మత్స్యకారులు వలసలు పోకుండా వారికి జెట్టిలు నిర్మిస్తామని హామీ ఇచ్చి అనుకున్నట్టుగా ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపట్టారన్నారు. వీటిని చూపిస్తే వాస్తవికతకు ఇంకా దగ్గరగా ఉండేదన్నారు. మత్స్యకార నాయకులు మాట్లాడుతూ ఏది ఏమైనా మత్స్యకారులను విడిపించి వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చిన జగనన్న రియల్ హీరో అన్నారు. సినిమా చూసిన వారిలో జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మత్స్యకార నాయకులున్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఈ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# నేల విడిచి సాము

(మొదటిపేజీ తరువాయి)

వైకాపా అధికారం కట్టబెట్టింది. మళ్లీ విపక్ష పాత్ర పోషించడంలో శాసనసభకు వెళ్లడం వంటి విషయంలో జగన్ వైఖరి మారడంలేదు

**జగన్ ఇక మారరా..**

కేవలం బటన్ నొక్కుడుతోనే అధికారం వస్తుందా? శాశ్వతంగా ఉండిపోతుందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి గట్టిగా 9 నెలలు కావస్తోంది. ఇంతలోనే భూగోళం బద్దలై పోతున్నట్లు ప్రజలు తిరుగుబాటు చేస్తున్నట్లు జగన్ భావిస్తున్నారు. చంద్రబాబు బటన్ నొక్కడంలో విఫలమయ్యారని, మోసాలకు గ్యారెంటీగా మారారని జగన్ విమర్శిస్తున్నారు. అదికూడా జనంలోకి వెళ్లికాదు. అసెంబ్లీ వేదికగా అంతకంటే కాదు. మీడియా ముందు కూర్చుని తన మాట, బాట ఇదేనంటున్నారు.

అసలు వైకాపా ఘోరంగా ఓడిపోవడానికి, కేవలం 11 సీట్లకే పరిమితం కావడానికి కారణమేంటి? ఇదేంటిరా ఇంత ఠంఛన్‌గా బటన్ నొక్కుతున్నాడని ఓడించారా? అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేసి, బటన్ నొక్కితే చాలనుకుంటే ఓడించారా? 2019 ఎన్నికల్లో అఖండవిజయాన్ని ఇచ్చిన ప్రజలే.. కేవలం ఐదు సంవత్సరాలకే విసిగిపోయారంటే, ఏమనుకోవాలి? జగన్‌కు సరియైన ప్రతిపక్ష హోదా కూడా రాకుండా ఘోర ఓటమిని అందించారంటే అర్థం ఏమిటి? జగన్ పాలనలో చేయరాని తప్పులు జరిగాయనేగా.. మరి ఆ తప్పులను సరిదిద్దుకుంటానని అనడానికే జగన్ ఇష్టపడటం లేదు.

మూడు రాజధానుల రగడ నుంచి, ఇసుక, మద్యం విధానాలలో అవినీతి దాకా ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, క్షేత్రస్థాయిలో అరాచకాలు పెరిగిపోయాయని భావించారు. అయినా 'ప్రజలకిచ్చిన ఉచిత హామీలకు కట్టుబడ్డాను, నెలవారీ పథకాల డబ్బులు బటన్ నొక్కి మీ ఖాతాలో వేశాను. ఇంకేంకావాలి' అని ప్రశ్నిస్తున్న జగన్ తీరు ఇప్పటికీ అలాగే ఉంది. చంద్రబాబు మాటలకు ఆశపడి మాత్రమే ప్రజలు వైకాపాను ఓడించారు. వైకాపా ప్రభుత్వంలో అసలు తప్పే జరగలేదు. రాష్ట్రం దివాళా తీయనేలేదు అనుకుంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంటే, ప్రజలే కోరి వచ్చి తిరిగి దగ్గరికి తీస్తారా? నవ్వి పోదురుగాక నాకేమి సిగ్గంటూ వైకాపా అధినేత వ్యవహరిస్తున్న తీరు ప్రశ్నార్థకం అవుతోంది.

**బటన్ నొక్కడమే విశ్వసనీయతా..**

ఉచిత హామీలు ఇచ్చాం, అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి చెప్పినట్లుగా బటన్ నొక్కాం. ఇదే అసలైన విశ్వతనీయత అనుకుంటూ ప్రజల సమస్యలను, రాష్ట్రంలో అభివృద్ధినీ పట్టించుకోకుంటే ప్రజలు విశ్వసిస్తారా? జగన్ 2.0లో అది చూస్తారు, ఇది చూస్తారు అనడం కాదు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వదలకుండా ప్రజాక్షేత్రంలో నిలబడాలి. గతంలో తాను, తన ప్రభుత్వం చేసిన తప్పులను గుర్తించి, భవిష్యత్లో అలాంటివి జరగవంటూ ప్రజలకు నమ్మకం కలిగించాలి. ప్రజలతో మమేకం కాగలగాలి. రైతు చట్టాల విషయంలో ప్రధాని నరేంద్రమోదీ ఎలా ప్రజలకు క్షమాపణ చెప్పి దూసుకురాగలిగారో అలాంటి రాజకీయం ప్రజల మెప్పు పొందుతుంది. ముందుగా జగన్ పార్టీని బలోపేతం చేసుకోవాలి. కేసుల భయంతో పార్టీ నేతలంతా పార్టీని వీడుతున్నారని చెప్పడం కాదు. అలాంటి పరిస్థితులు వారికి ఎందుకు వచ్చాయో గుర్తించి, భవిష్యత్ మార్గ నిర్దేశం చేసుకోవాలి. వైకాపాలో ఉన్న రాజ్యసభ సభ్యులందరూ జారుకుంటున్నారు. భవిష్యత్లో లోక్‌సభ సభ్యులూ, ఎమ్మెల్యేలు అదే దారిలో నడిచే ప్రమాదమూ ఉంది. అందుకే జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా కోసం తాపత్రయ పడకుండా అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలూ, కూటమి హామీల అమలు వైఫల్యాలనూ సభావేదికగా నిలదీయాలి. తనకూ ముఖ్యమంత్రితో సమానంగా మైక్ ఇస్తేనే సభకు వస్తా అనడం, ఇంకా తానూ ముఖ్యమంత్రినే అనే భ్రమలో ఉన్నట్లుంది.

**ముందుగా జగన్ 2.0 ప్రతిపక్ష నేతగా మారాలి. కూటమి వైఫల్యాలను అందిపుచ్చుకొని, నిత్యం ప్రజల ముందుకు వెళ్లాలి. ప్రజలు తిరిగి ఆశీర్వదిస్తే తాను భావిస్తున్నట్లు 30 ఏళ్లేం ఖర్మ.. యాభై సంవత్సరాలు పాలిస్తానన్నా కాదనేదెవరు? అపోజిషన్‌లోనూ పొజిషన్ చూసుకోకుండా జగన్ ఇకనైనా అసలుసిసలైన 2.0గా మారతారేమో చూడాలి.**

# రొయ్యమీసాలు తిప్పుతున్న మత్స్యశాఖ

మొదటిపేజీ తరువాయి

డ్రాచేశారు. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం అక్రమాలను తొలగించడానికి అక్రమంగా చెరువులు తవ్వి రొయ్యులు సాగు చేస్తున్న యాజమాన్యాల నుంచి ఆ మొత్తాన్ని వసూలుచేయాలి. అలా చేయకుండా 46 అక్రమంగా తవ్విన చెరువులను తొలగించడానికి అధికారులు ప్రభుత్వ డబ్బులను ఖర్చుచేశారు. మత్స్యశాఖ అధికారులు వారి చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి పెద్దగనగల్లవానిపేట, పుక్కళ్లపేట పరిధిలో ఉన్న రొయ్యల చెరువులను నాలుగు కిటగిరిలుగా విడదీసి సీఏఏ నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా తవ్వి సాగుచేస్తున్న రొయ్యల చెరువులకు అనుమతులు మంజూరు చేస్తున్నారు.

**స్థానికులు బినామీలుగా సాగు**

కోస్టల్ ఆక్వా అథార్టీ ప్రకారం పెద్దగనగల్లవానిపేట, పుక్కళ్లపేటకు 500 మీటర్లు దూరంలో రొయ్యలు సాగు చెయ్యాలి. అలా కాకుండా కేవలం 70 మీటర్ల దూరంలోనే రొయ్యిలు చెరువులు సాగు చేస్తున్నారు. సాగు చేస్తూ వారంతా స్థానికులను బినామీలుగా పెట్టుకొని ఇతర ప్రాంతాలకు చెందినవారి అజమాయిషీలో నడుస్తున్నాయి. 2016 నుంచి ఈ ప్రాంతంలో రొయ్యల సాగు అక్రమంగా నిర్వహించడానికి స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోత్సాహమే కారణం. సముద్రానికి అతి సమీపంలో అన్ సర్వే ల్యాండ్‌లో 74 ఎకరాల్లో 48 చెరువులు ఉన్నాయి. వీటలో 46 హైకోర్టు ఆదేశాలతో తొలగించినట్టు చెబుతున్నా పూర్తిస్థాయిలో ధ్వంసం చేయలేదు. మరో ఇద్దరు రొయ్యల చెరువుల రైతులు హైకోర్టు ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్‌కు అప్పీలుకు వెళ్లడంతో వాటి జోలికి వెళ్లలేదు. 7.19 ఎకరాల ప్రభుత్వ (పోరంబోకు) భూమిలో తవ్విన 7 రొయ్యల చెరువులు ఉన్నాయి. 12.15 ఎకరాల డి-పట్టా భూమిలో ఉన్న 9 రొయ్యల చెరువులు ఉన్నాయి. 39.86 ఎకరాల జిరాయితీ భూమిలో ఉన్న 28 చెరువులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని నాన్ అగ్రికల్చరల్ ల్యాండ్‌గా మార్చడానికి నాలా కట్టాలి. ప్రభుత్వ పోరంబోకు, డి-పట్టా భూమిలో అక్రమంగా తవ్విన చెరువులకు సీఏఏ అనుమతులు ఇచ్చేసి రొయ్యల వ్యాపారం చేయిస్తున్న ఘనత మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులదే.

**కేటగిరీలుగా విభజించి**

నాలుగు కేటగిరీలగా విభజించి రొయ్యలు సాగు చేస్తున్న చెరువులను కేటగిరి-ఎ లో సీఏఏ అనుమతులు ఉన్న 43 చెరువులు చేర్చారు. కేటగిరీ-బిలో మూడు నెలల కోసం రెన్యువల్ చేసిన 11 చెరువులను చేర్చారు. కేటగిరీ-సీలో అక్రమంగా రొయ్యలు సాగు చేస్తున్న రెండు చెరువులను చేర్చారు. కేటగిరీ-డీలో 46 చెరువులను నిబంధనలకు విరుద్ధంగా సముద్రంలో నాగావళి కలిసిన చోట అక్రమంగా రొయ్యలు సాగు చేస్తున్నారని 46 చెరువులను చూపించారు. వీటిని ధ్వంసం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. రొయ్యల చెరువులన్నీ గ్రామానికి 500 మీటర్ల లోపే ఉన్నాయని అధికారికంగా మత్స్యశాఖ అధికారులు చూపిస్తున్నారు. అయితే వీటిని తవ్వినప్పుడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్న తలెత్తుతుంది. న్యాయస్థానం జోక్యం చేసుకుంటే తప్ప వాటిని అక్రమమని అధికారులు ప్రకటించకపోవడంపైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎన్‌జీటీ తీర్పు కోసం..**

అధికారులు తొలగించినట్టు చెబుతున్న చెరువుల్లోనూ అనధికారికంగా రొయ్యల సాగు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్ సర్వే ల్యాండ్‌గా చూపిస్తున్న 57 ఎకరాల్లో కొత్తగా 34 రొయ్యలు చెరువులు ఉన్నా వాటి జోలికి అధికారులు వెళ్లడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే భూమిలో 17 ఎకరాల్లో 15 చెరువుల్లో దశాబ్ద కాలంగా రొయ్యల సాగుచేస్తున్నారు. వీటి జోలికి అధికారులు వెళ్లడంలేదు. పెద్దగనగల్లవానిపేట పరిధిలో చేపడుతున్న రొయ్యల సాగు అనధికారికంగా జరుగుతున్నా సబ్సిడీపై విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఈ చెరువుల నుంచే వచ్చే నీటిని నాగావళిలోకి విడిచిపెట్టడం వల్ల సమీప గ్రామాల్లో గ్రౌండ్ వాటర్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు రావాల్సివుందని స్థానిక యువత చెబుతున్నారు. ఈ తీర్పు వచ్చిన తర్వాత స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచిచూడాలని అంటున్నారు.






ఆమదాలవలసలో నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా 387వ రోజు శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి దేవి కమిటీ సభ్యులు అన్నసమర్పణ చేశారు. ఈ సందర్భంగా పలువురు పేదలు, అభాగ్యులకు భోజన పొట్లాలు అందించారు.

- సత్యంన్యూస్, ఆమదాలవలస

# జగన్ మానసిక స్థితి బాగాలేదనిపిస్తోంది

**అమరావతి:** రాజకీయాల్లో గెలుపు ఓటమిలు సహజమని, ఓడిపోతే అందుకు కారణాలు సమీక్షించుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 150 సీట్లతో అధికారంలోకి వచ్చిన వ్యక్తి ఐదేళ్లు ప్యాలెస్‌లకే పరిమితం అయ్యారని విమర్శించారు. ప్రతిపక్షాలు, మీడియా ఎంత ఘోషించినా ఐదేళ్లూ ప్యాలెస్‌లు వీడలేదన్నారు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండొద్దనే ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారన్నారు. అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా, నిరంతరం ప్రజల కోసం పనిచేసేవాడే నిజమైన నాయకుడని చెప్పారు. జగన్ మాటలు వింటుంటే ఆయన మానసిక స్థితి బాగా లేదనిపిస్తోందన్నారు. జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ మిర్చియార్డు వద్ద పచ్చి అబద్ధాలు చెప్పారని, ఎవరైనా నవ్వుతారన్న స్పృహ కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గుంటూరు మిర్చి యార్డు ఇప్పుడు కొత్తగా రాలేదని, గతంలోనూ ఉందని, రాష్ట్రంలో 11 జిల్లాల్లో మిర్చి పంట పండుతోందని, ధర రూ.13 వేలకు పడిపోయిందని జగన్ పేర్కొనడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గత పదేళ్లలో మిర్చి ధరలు పరిశీలిస్తే అత్యధికంగా రూ.13వేలు ధర ఉందని, రెండేళ్లు మాత్రమే మిర్చి రైతులకు రూ.20వేలు ధర పలికిందని, మిర్చి రైతులకు ఇబ్బందులున్న మాట వాస్తవమేనని, సాగు ఖర్చులు పెరిగాయని, పని లేకపోవడంతోనే జగన్ ఐదేళ్లూ నాటకాలాడి ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆదాయం తెచ్చే శాఖలకు జగన్ తాళం బిగించి, ఇప్పుడు వాటి గురించి మాట్లాడుతున్నారని, ఐదేళ్ల పాలనలో జగన్ రైతుల కోసం ఒక్క మంచి పని చూడా చేయలేదని, ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఏనాడూ పైసా ఇవ్వలేదని, రైతులకు మేలు చేయాలనేదే కూటమి ప్రభుత్వం ఆలోచన అని అచ్చెన్నాయుడు అన్నారు.

# హైందవ ధర్మ యోధుడు చత్రపతి శివాజీ

**గాంధీ మందిరంలో శివాజీ జయంతి వేడుకలు**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హైందవ ధర్మ పరిరక్షకుడుగా చత్రపతి శివాజీ ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్తల స్మృతి వనంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, పైడి హరినాధరావు, ఎన్.నరసింహమూర్తి, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ భారతదేశంలో ప్రతిఒక్కరూ చత్రపతి శివాజీ స్ఫూర్తితో జీవనం సాగించాలన్నారు. దేశం కోసం ధర్మం కోసం పోరాడిన యోధుడిగా, తన జీవనపర్యంతం భారతీయుల కోసం పోరాడిన శివాజీ అమ్మవారి సాక్షాత్కారం పొందిన ధన్యజీవిగా నిలిచిపోయారన్నారు. ప్రపంచానికి హిందూ ధర్మం విశిష్టతను చాటిచెప్పిన శివాజీ స్ఫూర్తి సజీవమన్నారు. తొలుత శివాజీ విగ్రహానికి బీజేపీ నాయకులు, గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు, వాకర్స్ ప్రతినిధులు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పలు రంగాల ప్రముఖులు జామి భీమశంకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ కొంక్యాన వేణుగోపాల్, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, పందిరి అప్పారావు, గేదెల లక్ష్మి, సుప్రియ, బుడుమూరు సూర్యారావు, నక్క శంకర్రావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, గుత్తు చిన్నారావు, తర్లాడ అప్పలనాయుడు పద్మావతి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తిలక్‌ను విమర్శించే అర్హత అజయ్‌కుమార్‌కు లేదు



(సత్యంన్యూస్, టెక్కలి)

అవినీతిలో కూరుకుపోయిన అజయ్‌కుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులకు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌ను విమర్శించే అర్హత లేదని వైకాపా జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, వైకాపా అధికార ప్రతినిధి సత్తారు సత్యం, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కోటబొమ్మాళి పార్టీ అధ్యక్షులు సంపతిరావు హేమసుందర్‌రాజు, టెక్కలి పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు అన్నారు. టెక్కలి వైకాపా కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌పై టీడీపీ నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తప్పుడు ఆరోపణలు మానుకోపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో కోటబొమ్మాళి జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, నందిగాం మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గుణరావు, వైకాపా నాయకులు నక్క భీమారావు, చిన్ని జోగారావు యాదవ్, జడ్యాడ జయరాం, ఎస్.వినోద్, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, తమ్మయ్య, తమరి రాజు, వానతవిటయ్య, కర్ణిక జీవన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాగావళిలో గుర్తుతెలియని మృతదేహం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని నాగావళి నదిలో హయాతినగరం వైపు గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. మృతదేహం కుళ్లిన స్థితిలో గుర్తు పట్టనట్టుగా ఉండడంతో వివరాలు లభ్యం కావడం లేదని ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. మృతుని వయసు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలు ఉంటుంది. మృతదేహం ఎడమ చేతి పై మహిళ బొమ్మ, అక్షరాలు పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం పరిశీలించారు. మృతి చెంది నాలుగు రోజులు అయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే సమాచారం కోసం ఒకటవ పట్టణ పోలీసుస్టేషన్‌కు రావాలని పోలీసులు తెలిపారు.



# చలో విశాఖ డెయిరీ జయప్రదం చేయండి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తగ్గించిన ఆవుపాలు ధర పెంచాలని, ఆవుపాలు కనీస వెన్న శాతాన్ని 2.8 శాతం నుంచి 3.1 శాతానికి పెంచడాన్ని వెనక్కి తీసుకోవాలని, 30 లీటర్ల కంటే తక్కువ పాలుపోసిన సెంటర్ల పాలు ఆపే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్చి రెండోవారంలో చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలు రైతులకు ఆపిన బోనస్ వెంటనే చెల్లించాలని, సేకరణ ధరకు మార్కెట్లో అమ్మకపు ధరకు ఉన్న వ్యత్యాసం ధరలో రైతుకు 10 రూపాయలు అదనంగా చెల్లించాలని, బోనస్ నాలుగు నెలలకు ఒకసారి ఇవ్వాలని, ప్రభుత్వం సాహకార రంగంలో పాలు పోసిన రైతులకు లీటర్లకు ఐదు రూపాయలు ప్రోత్సాహం ఇవ్వాలని, హౌస్ కమిటీ విచారణ పూర్తిచేసి దోషులను శిక్షించి డెయిరీ ఆస్తులను, రైతులను కాపాడాలని ఆయన అన్నారు. మార్చి రెండో వారంలో చలో విశాఖ డెయిరీ కార్యక్రమానికి వేలాది మంది రైతులను సమీకరించి పోరాడి యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని సమావేశం తీర్మానాన్ని సభ్యులందరూ ఆమోదించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్ రావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, బగాది వాసుదేవరావు, అల్లు సూర్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.